గురుకుల కాంట్రాక్టర్స్ సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మల్లాపూర్: తెలంగాణ గురుకుల హాస్టళ్లలో ఐదు నెలల పెండింగ్ బిల్లులను విషయంపై మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు, ఉపాధ్యక్షులు నల్ల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ నాయకులు విజయ్‌కుమార్, ఎండీ పాషా, సుదర్శన్‌లు కలిసి వినతి పత్రం ఇచ్చారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌తో పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేయాలని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కోరారు. మహేష్‌కుమార్‌గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా పదవి చేపట్టి ఏడాది పూర్తికావడంతో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి ఆయనను సత్కరించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆర్‌యూబీ నిర్మాణానికి తగిన చర్యలు

గౌతంనగర్: దశాబ్దకాలంగా నెలకొన్న రైల్వే గేట్ సమస్య ఎట్టకేలకు పరిష్కారం కానుంది. మంగళవారం రైల్వే, ప్రాజెక్ట్ జలమండలి, విద్యుత్, జీహెచ్‌ఎంసీ అధికారులు ఆర్‌యూబీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఎట్టకేలకు దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వేగేట్ సమస్య పరిష్కారమవుతుండటంతో ప్రయాణికులు, గౌతంనగర్ డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరం

గౌతంనగర్: డివిజన్ దయానంద్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం డాక్టర్ శారద ఆధ్వర్యంలో పోలీసులకు పలు వైద్య పరీక్షలు చేశారు. నర్సు ఇందిరా, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, ఎస్సై దీప్తి, సైదయ్య, నూర్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు అభినందన



ఉప్పల్: ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 6 మంది విద్యార్థులకు క్లాస్‌మెంట్ క్లబ్ ఎల్బీనగర్ ఆధ్వర్యంలో మంగళవారం ఒక్కో విద్యార్థికి రూ.1116 ప్రోత్సాహకాన్ని అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు శిరీషా, క్లాస్‌మెంట్ క్లబ్ ఎల్బీనగర్ కోశాధికారి రాము, సభ్యులు చంద్రశేఖర్, అజయ్‌సింగ్, డాక్టర్ గౌతమ్‌రాజ్ పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం

మహిళా డాక్టర్‌ను మోసం చేసిన వివాహితుడు

అల్వాల్: పెళ్లి చేసుకుంటానని మహిళా డాక్టర్‌ను నమ్మించి రూ.35 లక్షలు కాజేసి, బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్‌ఎంటీ అల్వాల్‌లో నివాసం ఉండే మహిళా డాక్టర్‌కు గతేడాది ఆన్‌లైన్ ద్వారా పరిచయమైన సంగారెడ్డి, అమీన్‌పూర్‌కు చెందిన ఏఎస్‌ఆర్ సుబ్రహ్మణ్యం (34) తనకు వివాహం కాలేదని పెళ్లి చేసుకుందామంటూ.. నమ్మించి అవసరాలు ఉన్నాయంటూ చెప్పి పలు దఫాలుగా రూ.25 లక్షలు ఆమె వద్ద తీసుకున్నాడు. దీనితో పాటు డాక్టర్ తల్లికి చెందిన 15 తులాల బంగారం సైతం అతడికి ఇచ్చింది. కాగా కొంతకాలంగా తాము పెళ్లి చేసుకుందామంటూ.. సదరు డాక్టర్ ఒత్తిడి తీసుకురావడంతో అతడు ముఖం చాటేస్తూ.. ఫోన్ నెంబర్ బ్లాక్‌లో పెట్టాడు. అనుమానం రావడంతో అతడి గురించి ఆరా తీయగా.. సుబ్రహ్మణ్యానికి వివాహమై ఇద్దరు సంతానం ఉన్నట్లు తేలింది. ఈ విషయమై ప్రశ్నించగా సోషల్ మీడియాలో పెడతానని, బెదిరింపులకు పాల్పడ్డాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్కడి సమస్యలక్కడే.. ?

- మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో కనీస సౌకర్యాలు కరువు
- నిర్వహణ లోపంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పార్కింగ్ లేకపోవడంతో వాహనదారుల అవస్థలు



వ్యర్థాలతో పరిసరాలు



రామంతాపూర్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్

రామంతాపూర్: సామన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా అతి తక్కువ ఖర్చుతో తమ ఇంట్లోని శుభకార్యాలు నిర్వహించుకునేందుకు దాదాపు రూ.4 కోట్లతో రామంతాపూర్ అరవింద్ గాంధీనగర్‌లో గత ఐదేళ్ల క్రితం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మించారు. అన్ని హంగులతో గ్రౌండ్ ఫ్లోర్‌లో భోజనశాల వంటగది మొదటి అంతస్తులో కల్యాణ మండపాన్ని జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తోంది.

వంట సామగ్రి ప్రైవేటు వ్యక్తికి..

ఈ ఫంక్షన్‌హాల్‌కు సరైన నిర్వహణలేకపోవడంతో పాటు శుభకార్యాలకు వచ్చే బంధుమిత్రుల వాహనాలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుభకార్యాలకు అవసరమయ్యే వంటసామగ్రి, టెంట్, కుర్చీలు తదితర సామగ్రి సరఫరా ప్రైవేట్ వ్యక్తికి అప్పజెప్పడంతో వాటి ధరలు ఎక్కువగా ఉండటం వంటి సమస్యలు ఉండటం వల్ల చాలామంది స్థానికులు శుభకార్యాలు చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు.

మురుగుతో ఇబ్బంది..

ఫంక్షన్‌హాల్‌కు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో శుభకార్యాలు జరిపినప్పుడల్లా మురుగు డ్రైనేజీ రోడ్ల నుంచి స్థానిక గాంధీనగర్ కాలనీలోకి వచ్చి చేరుతోంది. దీంతో పరిసర ప్రాంతాలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి.

పరిష్కారం ఇలా..

- ఫంక్షన్‌హాల్ నిర్వహణ జీహెచ్‌ఎంసీ అధికారులే చేపట్టాలి. శుభకార్యాలు నిర్వహించేటప్పుడు వచ్చే బంధుమిత్రుల వాహనాలను దగ్గరలో ఉన్న జనప్రియ అపార్టుమెంట్ ఎదురుగా ఉన్న జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో పార్కింగ్ ఏర్పాటు చేయాలి.
- మురుగు, డ్రైనేజీ వ్యవస్థను మార్చి పెద్ద పైపులైన్‌ను ఏర్పాటు చేసి బైపాస్ రోడ్డులో ఉన్న వరద నీటి కాలువకు అనుసంధానం చేయాలి.
- కుర్చీలు, టెంట్ సామగ్రి వంటపాత్రలన్నీ హాల్‌ను బుక్‌చేసుకునేటప్పుడు చెల్లించే ఫీజులోనే ఇమిడి ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి. వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు ఫంక్షన్‌హాల్ నిర్వహణ చేపట్టి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కమిటీని ఏర్పాటు చేయాలి



రామంతాపూర్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్వహణలో భాగంగా స్థానికులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేయాలి. శుభకార్యాలకు అవసరమయ్యే కుర్చీలు, టెంట్, వంట సామగ్రి ఫంక్షన్‌హాల్‌కు చెల్లించే ఫీజులోనే ఉచితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– సతీష్, ఆర్టీసీకాలనీ, రామంతాపూర్

ఎమ్మెల్యేను కలిసిన నాయీబ్రాహ్మణులు



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

అల్వాల్: నేరేడ్‌మెట్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ కులవృత్తి వాసులకు స్థలం కేటాయించాలని, 250 యూనిట్ల ఉచిత కరెంట్ సబ్సిడీని పునరుద్ధరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రేషన్‌కార్డులు, పెన్షన్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌లు వంటి సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నేతలు రాజశేఖర్‌రెడ్డి, నేరేడ్‌మెట్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



గౌతంనగర్: డివిజన్ అన్నపూర్ణ సొసైటీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం దిశగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి చొరవతో మంగళవారం పలు విభాగాల అధికారులు సొసైటీలో పర్యటించారు. కొద్ది రోజుల క్రితం సొసైటీ సమస్యలపై సభ్యులు మీడియా సమావేశం నిర్వహించి తెలపడంతో అధికారులు కదలివచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు డ్రైనేజీ, రహదారులు, తాగునీటి సరఫరా, శానిటేషన్ వంటి సమస్యలపై అధికారులకు వివరించారు. దీనిపై అధికారులు స్పందించి సొసైటీ సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. అన్నపూర్ణ సొసైటీ ప్రతినిధులు రమణారెడ్డి, మల్కాజిగిరి టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

మల్కాజిగిరి: బీజేఆర్‌నగర్‌లోని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన కాలనీలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నూతన కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించామన్నారు. దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్ మార్చాలని, పాత పైపులైన్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వెంటనే రక్షణ కంచె ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. మంజూరైన నిధులతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరామన్నారు. ఈఈ లౌక్య, మేనేజర్ నవీన్, వీఐ రజనీకాంత్, స్థానికులు బాబు, ఆంథోని, కిషోర్, శ్రీనివాస్, నర్సింగరావు, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వీరేందర్‌గౌడ్





రామంతాపూర్ : బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తూళ్ల వీరేందర్‌గౌడ్‌ను మంగళవారం బీజేపీ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఎల్లాచారి, రఘుపతిగౌడ్, రవీందర్ రెడ్డి, రమేష్‌నాయక్, హరిబాబు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తూళ్ల వీరేందర్‌గౌడ్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఎన్నికైన మేకల శిల్పారెడ్డిని మంగళవారం మల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గూడురు శైలేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నేతలు కేశవరం యాదగిరి, సీతాల విజయ్, ముత్యంరెడ్డి, గణేష్, రామయ్య, వీరేష్, లక్ష్మారెడ్డి, మురళీగౌడ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



చిలుకానగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత

ఉప్పల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ అధికారులకు సూచించారు. చిలుకానగర్ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీలో వేస్తున్న సీసీరోడ్డు పనులను మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడితే సహించేది లేదని, కాంట్రాక్టర్ నిబంధనలను పాటిస్తూ.. రోడ్డు వేయాలన్నారు. డీఈ వినీల్‌గౌడ్, ఏఈ రాధిక, బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్, జగన్, బాలు, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మల్లాపూర్: విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని ఎస్సై రాములునాయక్ సూచించారు. మంగళవారం రాచకొండ పోలీస్ కమిషనర్, ఎస్వోటీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి అడిషనల్ డీసీపీ జాకీర్ హుస్సేన్ ఆదేశాల మేరకు నాచారం పేజీ హైస్కూల్‌లో నూతన చట్టాలు, సైబర్ మోసాలు, మహిళలపై జరుగుతున్న దాడులు తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ బెదిరింపులు, మోసాలకు గురైతే సైబర్ క్రైమ్స్ డయల్ 1930, ఉమెన్ హెల్ప్‌లైన్ 1091, 181 చైల్డ్ హెల్ప్ లైన్ 1098/112, డయల్ 100 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఎండీ ఖాలీల్ వాసి, అనురాధ, ఎస్‌పీఓ అరుణాక్రాంతిరెడ్డి తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మర్యాదపూర్వక కలయిక



అల్వాల్: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా దంపతులు, కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయింపు



అల్వాల్ పోలీస్‌స్టేషన్ పక్కన స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

అల్వాల్: దశాబ్దాల కాలం నుంచి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నా.. ఎట్టకేలకు అల్వాల్‌లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు టెంపుల్ అల్వాల్‌లోని పోలీస్‌స్టేషన్ పక్కన స్థలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసేందుకు మంగళవారం స్థలాన్ని చదును చేసి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. సదరు స్థలంలో నివాసం ఉంటున్న రిక్షా కార్మిక కుటుంబాలను ఇతర ప్రాంతాలకు తరలించనున్నట్లు అధికారులు వివరించారు. త్వరలో తాత్కాలిక భవనం నిర్మించి అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు హర్షనీయం : ఎమ్మెల్యే మర్రి

జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు 11 గుంటల స్థలం కేటాయించడంతో పాటు సత్వర చర్యలు చేపట్టినందుకు ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు స్థలం వద్దకు వచ్చి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషిచేశారన్నారు.

మాజీ ఎమ్మెల్యే చొరవతోనే..

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చొరవతోనే రెండేళ్ల క్రితమే అల్వాల్‌లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలన్న నిర్ణయం జరిగిందని సీనియర్ కాంగ్రెస్ నేత తోట లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



మల్లాపూర్: వామ్ గ్లోబల్ సీనియర్ సిటిజన్స్ సేవలు అభినందనీయమని గ్రేటర్ బీఆర్‌ఎస్ నేత సాయిజెన్‌శేఖర్ అన్నారు. మంగళవారం వామ్ గ్లోబల్ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో నాచారం వెస్లీ స్కూల్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, బిస్కెట్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నరసింహగుప్తా, రామకృష్ణ, నాచారం వాసవీ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు బండల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బొగ్గారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగ ఫలితమే ఉచిత విద్యుత్

ఉప్పల్: తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి ఉపేందర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ అమర వీరుల ప్రాణత్యాగమే పేదలకు ఉచిత విద్యుత్ వెలుగులు వచ్చాయని పలువురు రామకృష్ణ త్యాగాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకాల సబ్సిడీ బకాయిలను వెంటనే చెల్లించాలని వారు కోరారు.



అభివృద్ధి పనులపై సమీక్ష



జలమండలి మేనేజర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలో మంజూరైనా భూగర్భ డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్‌కు సూచించారు. మంగళవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో భూగర్భడ్రైనేజీ పనులపై సమీక్షించారు. నిధులు మంజూరైన ఓల్డ్ మల్లాపూర్, న్యూ భవానీనగర్, అశోక్‌నగర్, బ్రహ్మపురికాలనీ, నాచారం బాబానగర్ పార్ట్ ఏరియాలో పనులు చేపట్టాలన్నారు. అవసరమైన చోట డ్రైనేజీ పైపులైన్ కోసం నూతనంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనిస్తాం

మల్కాజిగిరి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందిస్తామని లయన్స్‌క్లబ్ హైదరాబాద్ మల్కాజిగిరి సెంట్రల్ అధ్యక్షుడు లయన్ కృష్ణ అన్నారు. మంగళవారం బాలికల ప్రభుత్వ, ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా జాయ్ ఆఫ్ యోగా అకాడమీ డైరెక్టర్ నాగలక్ష్మి హాజరయ్యారు. లయన్స్ క్లబ్ తరుపున చదువులో రాణించిన విద్యార్థులకు చేయూతనందిస్తామన్నారు. ప్రభుత్వ స్కూళ్లల్లో నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులే ఉంటారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సురేష్, రంగా శ్రీనివాస్, అశోక్‌రాందాస్, శ్రీనివాసరావు, వేముల వెంకటేష్, జంగయ్యయాదవ్, బలరాం , స్వరాజ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



మీనా

మల్కాజిగిరి: యువతి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. వసంతపురి కాలనీకి చెందిన మీనా(30) గత కొంతకాలంగా ఉద్యోగం లేక ఇంటి వద్దే ఉంటోంది. 1న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లి సోమవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



రామంతాపూర్ పబ్లిక్ స్కూల్‌లో..

ఉప్పల్: లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ భాషా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బోడుప్పల్: ప్రఖ్యాత కవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను మంగళవారం బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ శ్యాంసుందర్‌రావు, మేనేజర్ ప్రవీణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో ప్రజాకవి పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ నవనీతరావు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కాళోజీ కీలకపాత్ర వహించారని తెలంగాణ భాషా మాండలికాన్ని కాపాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అనంతరం విద్యార్థుల ఉపన్యాసాలు, పొడుపు కథలు, నాటకప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, డైరెక్టర్ మనోహర్‌రావు, కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్ : ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా మంగళవారం రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్య పఠనం, కథారచన, వకృత్వం, దేశభక్తి గీతాలు, పాటలు, కవితలు, నృత్య పోటీలను నిర్వహించారు. విజేతలకు స్కూల్ ప్రిన్సిపాల్ నర్సింహరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ కో – ఆర్డినేటర్ దీపిక, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో మంగళవారం తెలంగాణ తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాహితీ దిగ్గజాలైన డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి, కాళోజీ నారాయణరావు గురించి నృత్యరూపాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో..



నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో..



లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో..